

3 కోట్ల 'లఖ్ పతి దీదీ'లు

మహిళలను లక్షాధికారులను చేసేందుకు ఉద్దేశించిన 'లఖ్ పతి దీదీస్' కార్యక్రమం కింద టార్గెట్ ను ఆర్థిక మంత్రి పెంచారు. దేశవ్యాప్తంగా 2 కోట్ల మంది మహిళలను లక్షాధికారులను చేయాలని లక్ష్యంగా పెట్టుకోగా, తాజా బడ్జెట్ లో దీనిని 3 కోట్లకు పెంచారు. ఈ స్కీం కింద స్వయం సహాయక సంఘాల మహిళలు ఏటా కనీసం రూ. లక్ష సంపాదించేలా ప్రోత్సహించనున్నారు. ఇక నేషనల్ లైవ్లీహుడ్ మిషన్ అజీవిక కోసం రూ. 15,047 కోట్లను అలకేట్ చేశారు. గత ఏడాది కంటే 6 శాతం అధికంగా నిధులు కేటాయించారు. అయితే, ప్రధాన మంత్రి గ్రామ సడక్ యోజనకు మాత్రం నిధులను తగ్గించారు. గత బడ్జెట్ లో ఈ పథకానికి రూ. 19 వేల కోట్లు కేటాయించగా, రివైజ్డ్ ఎస్టిమేట్స్ ప్రకారం రూ. 17 వేల కోట్లు ఖర్చు చేశారు. ఈ సారి ఈ పథకానికి రూ. 12 వేల కోట్లు మాత్రమే అలకేట్ చేశారు.



పర్యావరణానికి 3,265 కోట్లు

న్యూఢిల్లీ : బడ్జెట్‌లో పర్యావరణ మంత్రిత్వ శాఖకు కేంద్ర ప్రభుత్వం రూ.3,265 కోట్లు కేటాయించింది. సెంట్రల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్, సెంట్రల్ జూ అథారిటీ, నేషనల్ బయోడైవర్సిటీ అథారిటీ, కమిషన్ ఫర్ ఎయిర్ క్వాలిటీ మేనేజ్‌మెంట్ వంటి చట్టబద్ధమైన, నియంత్రణ సంస్థలకు రూ.192 కోట్లు కేటాయించారు. అలాగే, వన్యప్రాణుల ఆవాసాల సమగ్రాభివృద్ధికి ప్రభుత్వం రూ.450 కోట్లు కేటాయించింది. అటవీ విస్తీర్ణాన్ని పెంచడం, ఇప్పటికే ఉన్న అటవీ భూమిని రక్షించడం లక్ష్యంగా పనిచేస్తున్న నేషనల్ మిషన్ ఫర్ గ్రీన్ ఇండియాకు బడ్జెట్‌ను రూ.160 కోట్ల నుంచి రూ.220 కోట్లకు పెంచారు.



08 | Follow: v6velugu | ప్రభాత వెలుగు | శుక్రవారం | హైదరాబాద్ 02.02.2024 www.v6velugu.com | BUDGET బడ్జెట్ 2024



2047 నాటికి అభివృద్ధి పథంలో..

న్యూఢిల్లీ: నిరుపేదలు, రైతులకు పెద్దపీట వేస్తూ మోదీ ప్రభుత్వం మధ్యంతర బడ్జెట్ గురువారం ప్రవేశ పెట్టింది. వచ్చే లోకసభ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని పలు రంగాలకు భారీగా నిధులు కేటాయించింది. టూరిజం, హౌసింగ్, రెన్యూవబుల్ ఎనర్జీ సెక్టార్‌లకు బూస్ట్ ఇచ్చేలా ప్రకటనలు చేసింది. రాబోయే ఐదేండ్లు ఎంతో కీలకం అన్న ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్.. 2047 నాటికి దేశం మరింత అభివృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఏప్రిల్‌లో జరిగే లోక్‌సభ ఎన్నికల తర్వాత పూర్తి స్థాయి బడ్జెట్ ను ప్రవేశపెడ్తారు. ఈ మధ్యంతర బడ్జెట్ లో విన్నర్స్.. లూజర్స్ ఎవరో చూసుకుంటే..

విన్నర్స్

అగ్రికల్చర్
వ్యవసాయ రంగంలో ప్రైవేట్, పబ్లిక్ ఇన్వెస్ట్‌మెంట్లు పెంచేందుకు కేంద్రం ప్లాన్ చేస్తున్నది. మోడ్రన్ స్టోరేజీ సిస్టమ్‌తో పాటు సప్లై చైన్‌ను మెరుగుపర్చుకోవాలని భావిస్తున్నది. ఆయిల్ సీడ్ పంటల సాగు పెంపునకు బూస్ట్ ఇవ్వాలనుకుంటున్నది. అదేవిధంగా, పాడి రైతుల అభివృద్ధికి సమగ్ర కార్యాచరణ రూపొందించేందుకు నిర్ణయించింది. వ్యవసాయ రంగ ఉత్పత్తులు పెంచడంతో పాటు మత్స్య సంపద మరిన్ని నిధులు ఖర్చు చేయాలని భావిస్తున్నది.

మిడిల్ క్లాస్
గతేడాది ప్రతిపాదించిన కొత్త పన్ను విధానాన్నే ఈసారీ కొనసాగించింది. ఎలాంటి ఇబ్బందుల్లేకుండా డబ్బులు ఖర్చు చేసేందుకు పన్ను రేట్ల పరిమితిని ప్రభుత్వం పెంచింది. అద్దె ఇండ్లు, మురికివాడలు, అనధికారిక కాలనీల్లో ఉంటున్న మధ్య తరగతి వర్గాల సొంతింటి కల నెరవేరుస్తామని ప్రకటించింది. ఇల్లు కొనేందుకు లేదా కట్టుకునేందుకు ఆర్థిక సాయం అందిస్తామని చెప్పింది. హౌసింగ్ ఫర్ ఆల్ అనే నినాదంతో కేంద్రం ముందుకు వెళ్తున్నది. దేశ ఆర్థిక అభివృద్ధికి ఇది ఎంతో కీలకమని భావిస్తున్నది. డెవలప్ అయిన దేశానికి ఇదొక మైలురాయిగా భావిస్తున్నది.

టూరిజం
దేశంలో టూరిజంను మరింత అభివృద్ధి చేసేందుకు కేంద్రం నిర్ణయించింది. దీంతో ఆ రంగంపై ఆధారపడి ఉన్న వర్గాలు ఆర్థికంగా అభివృద్ధి చెందుతాయి. ఇండియన్ టూరిజంను ప్రపంచ వ్యాప్తం చేసేందుకు కూడా కేంద్రం నిర్ణయించింది. టూరిజం డెవలప్‌మెంట్ రాష్ట్ర ప్రభుత్వాలపై ఎక్కువ ఆధారపడి ఉండటంతో దీర్ఘ కాలిక వడ్డీ లేని రుణాలు ఇచ్చేందుకు కూడా ప్లాన్ కేంద్రం చేస్తున్నది. లక్ష్యద్వీప్‌తో పాటు ఇతర ప్రాంతాలకు పోర్ట్ కనెక్టివిటీ పెంచేందుకు నిర్ణయించింది.

రెన్యూవబుల్ ఎనర్జీ
విండ్ ఎనర్జీ రంగంలో ప్రభుత్వం వయబిలిటీ గ్యాప్ ఫండింగ్‌ను ప్రకటించినప్పటికీ.. అది అంచనాల కంటే తక్కువే ఉంది. 2070 నాటికి ఇండియాను జీరో కార్బన్ దేశంగా మార్చే యోచనలో కేంద్రం ఉన్నది. దీని కోసం రెన్యూవబుల్ ఎనర్జీ సెక్టార్ పై ఫోకస్ పెట్టింది. ఈ రంగానికి సంబంధించిన పరిశ్రమలను ప్రోత్సహించేందుకు సబ్సిడీలు ఇవ్వాలనుకుంటున్నది. ఈ స్కీమ్ కోసం నిధులు ఎలా అందించాలనే దానిపై ప్రణాళికలు సిద్ధం చేస్తున్నది.

లూజర్స్

ఇన్‌ఫ్రాస్ట్రక్చర్
వచ్చే ఆర్థిక సంవత్సరం నాటికి ఇండియన్ ఎకానమీని 11.1 ట్రిలియన్ రూపాయలకు తీసుకెళ్లేందుకు కేంద్రం ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. అనుకున్న టార్గెట్ కు చేరుకోవాలంటే ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సెక్టార్ ఎంతో కీలకం. ఈ ఆర్థిక సంవత్సరంలో చేపట్టనున్న భారీ మౌలిక సదుపాయాల ప్రాజెక్టులకు కేటాయింపులు రూ.11.1 లక్షల కోట్లకు పెంచింది. ఇది గత ఏడాదితో పోలిస్తే 11.1 శాతం పెరిగింది. అయితే, క్షీణిస్తున్న మౌలిక సదుపాయాల సవాళ్లను ముందుగా పరిష్కరించాల్సి ఉంది. ఇండియా పెట్టుబడుల్లో మరింత గణనీయమైన పెరుగుదల అవసరం.

ఎలక్ట్రిక్ వెహికల్స్
పర్యావరణ వ్యవస్థను దృష్టిలో పెట్టుకుని ఎలక్ట్రిక్ వెహికల్స్ రంగం మరింత విస్తరింపజేసేందుకు కేంద్రం యోచిస్తున్నది. ట్రాన్స్‌పోర్ట్ రంగంలో ఈవీ వెహికల్స్‌కు ప్రత్యేక స్థానం ఇవ్వాలని భావిస్తున్నది. దీనికి అనుగుణంగా పబ్లిక్ చార్జింగ్ ఇన్‌ఫ్రాను అభివృద్ధి చేయాలనుకుంటున్నది. ఎలక్ట్రిక్ పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్‌ను పెంచాలని అనుకుంటున్నది. అయితే.. మార్చిలో ముగిసే 1.2 బిలియన్‌ల సబ్సిడీ ప్రోగ్రామ్‌ను పొడిగించే దానిపై మాత్రం ఎలాంటి ప్రకటన చేయలేదు.

జ్యూవెల్లర్స్
జ్యూవెల్లర్స్‌కు మాత్రం మధ్యంతర బడ్జెట్‌లో నిరాశే ఎదురైంది. బంగారంపై విధించే ఇంపోర్ట్ ట్యాక్స్ 15 శాతం యథావిధిగా ఉంచింది. దీంతో టైటాన్ గ్రూప్‌కు చెందిన టైటాన్‌కో, కల్యాణ్ జ్యువెల్లర్స్ ఇండియా లిమిటెడ్, సెన్‌కో గోల్డ్ సహా బంగారంతో వ్యాపారం చేసే కంపెనీ షేర్లన్నీ గురువారం పడిపోయాయి. దేశంలో అక్రమంగా బంగారం ఇంపోర్ట్ అవుతున్నదని, దాన్ని తగ్గించాలని జ్యూవెల్లర్స్ ప్రభుత్వాన్ని కోరారు. పన్ను తగ్గిస్తే అక్రమ బంగారం రవాణా అడ్డుకోవచ్చని సూచించారు. అయినా, ఇంపోర్ట్ ట్యాక్స్ మాత్రం తగ్గించలేదు.

పెట్టుబడుల ఉప సంహరణ
ఈ ఆర్థిక సంవత్సరంలో టికెట్ సేల్స్ భారీగా తగ్గాయి. దీంతో తన పెట్టుబడుల ఉపసంహరణ లక్ష్యాన్ని కేంద్ర ప్రభుత్వం తగ్గించుకుంది. 2024, మార్చి నాటికి రూ.51వేల కోట్లు డిస్‌ఇన్వెస్ట్‌మెంట్ టార్గెట్ పెట్టుకోగా.. దాన్ని రూ.30వేల కోట్లకు తగ్గించుకుంది. వచ్చే ఆర్థిక సంవత్సరం లక్ష్యాన్ని రూ.50వేల కోట్లుగా నిర్ణయించుకుంది.

హెల్త్‌కు ఫండ్స్ పెరిగినయ్

- గతేడాదితో పోలిస్తే 12% అధికం
- కొత్త మెడికల్ కాలేజీల ఏర్పాటుకు నిర్ణయం
- ఆయుష్ మినిస్ట్రీ కోసం 3,712 కోట్లు
- ఆశా, అంగన్‌వాడీ వర్కర్స్‌కు ఆయుష్మాన్ భారత్ వర్తింపు

వైద్య ఆరోగ్య శాఖకు రూ.90 వేల కోట్లు



న్యూఢిల్లీ: 2024 - 25 ఫైనాన్షియల్ ఇయర్‌కు సంబంధించిన మధ్యంతర బడ్జెట్‌లో వైద్య ఆరోగ్య శాఖకు రూ.90,658 కోట్లు కేటాయించారు. 2023 - 24 ఫైనాన్షియల్ బడ్జెట్ కంటే 12.59 శాతం ఎక్కువ నిధులు కేటాయించారు. పోయిన ఏడాది రూ.80,517 కోట్లు వైద్య ఆరోగ్య శాఖకు అలాట్ చేశారు. కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో కొనసాగుతున్న ఆయుష్మాన్ భారత్ ఇన్సూరెన్స్ స్కీమ్‌ను ఆశా, అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్‌కు వర్తింపజేస్తున్నట్టు ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించారు. పలు రాష్ట్రాల్లో కేంద్ర ప్రభుత్వం మరిన్ని మెడికల్ కాలేజీలు ఏర్పాటు చేసేందుకు నిర్ణయించినట్టు వివరించారు. హాస్పిటల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ మరింత డెవలప్ చేస్తామని తెలిపారు. దీని కోసం కమిటీ ఏర్పాటు చేస్తామని కూడా ఆమె ప్రకటించారు. కమిటీ రిపోర్టు, రికమండేషన్స్ ఆధారంగా వైద్య ఆరోగ్య శాఖ రంగాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. తాజాగా కేటాయించిన రూ.90,658 కోట్ల నుంచి హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్‌కు రూ.87,656 కోట్లు అలాట్ చేసిందిన. హెల్త్ రీసెర్చ్ డిపార్ట్‌మెంట్‌కు రూ.3,001 కోట్లు కేటాయించింది. ఆయుష్ మినిస్ట్రీ కోసం రూ.3,712 కోట్లు కేటాయించింది. గతంలో రూ.3వేల కోట్లు అలాట్ చేసింది. 2022-23తో పోలిస్తే 23.74 శాతం కేటాయింపులు పెంచింది. వైద్యులుగా ప్రజలకు సేవ చేయాలని చాలామంది యువత ఆశ పడుతున్నట్టు తెలిపింది.

దేశవ్యాప్తంగా 'యూ విన్' ప్లాట్‌ఫామ్

కేంద్ర ప్రభుత్వం స్పాన్సర్ చేసే స్కీమ్స్‌కు గత ఆర్థిక సంవత్సరం (రూ.77,624 కోట్లు)తో పోలిస్తే.. ఈ సారి రూ.87,656 కోట్లకు పెంచినట్టు వివరించారు. "పిల్లల్లో రోగ నిరోధకత పెంచడం కోసం తీసుకొచ్చిన 'మిషన్ ఇంద్ర ధనుస్సు'ను నిర్వహించేందుకు కొత్తగా ఏర్పాటు చేసిన 'యూ విన్' ప్లాట్‌ఫామ్‌ను దేశవ్యాప్తంగా విస్తరిస్తాం. మాతా, శిశు ఆరోగ్య సంరక్షణ కోసం అమలు చేస్తున్న పథకాలను సమగ్ర ప్రోగ్రామ్ కిందకు తీసుకొస్తాం. సాక్షమ్ అంగన్‌వాడీ స్కీమ్ కింద అంగన్‌వాడీ కేంద్రాలను ఆధునీకరిస్తాం. చిన్నారుల ఎదుగుదల కోసం పోషకాహార పంపిణీని మెరుగ్గా అందించేందుకు పోషణ్ 2.0 కార్యక్రమాన్ని అప్‌గ్రేడ్ చేస్తాం"అని నిర్మల ప్రకటించారు.

సర్వైకల్ క్యాన్సర్ నివారణకు వ్యాక్సినేషన్
9 నుంచి 14 ఏండ్ల బాలికల్లో గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ ('సర్వైకల్ క్యాన్సర్) నివారణకు చర్యలు తీసుకుంటామని నిర్మలా సీతారామన్ ప్రకటించారు. వ్యాక్సినేషన్‌పై దృష్టి పెడ్తామన్నారు. "ప్రపంచ మహిళా జనాభాలో 16 శాతం మంది ఇండియాలోనే ఉన్నారు. సర్వైకల్ క్యాన్సర్ బారిన పడుతున్న ప్రతి నలుగురిలో ఒకరు మన దేశానికి చెందినవారే. ఈ వ్యాధి కారణంగా చనిపోతున్న వారిలో మూడో వంతు మంది మన మహిళలే ఉన్నారు. తాజా లెక్కల ప్రకారం.. ఏటా దేశంలో 80 వేల మంది సర్వైకల్ క్యాన్సర్ బారిన పడుతున్నారు. 35 వేల మంది ఈ వ్యాధి కారణంగా చనిపోతునట్టు తేలింది"అని నిర్మలా సీతారామన్ తెలిపారు.



తల్లీబిడ్డలు భద్రం

మహిళా, శిశు సంక్షేమానికి రూ.26 వేల కోట్లు కేటాయింపు

న్యూఢిల్లీ: మహిళా, శిశు సంక్షేమ అభివృద్ధి శాఖకు రూ.26వేల కోట్లు కేటాయించారు. 2023-24 ఫైనాన్షియల్ ఇయర్‌తో పోలిస్తే 2.52 శాతం నిధులు ఎక్కువగా అలాట్ చేశారు. రూ.26వేల కోట్లలో అత్యధికంగా సాక్షమ్ అంగన్‌వాడీ, పోషణ్ 2.0 కింద ఉండే ఐసీడీఎస్, అంగన్‌వాడీ సర్వీసెస్, పోషణ్ అభియాన్, యుక్త వయస్సు అమ్మాయిలకు సంబంధించిన స్కీమ్స్ కోసం రూ.21,200 కోట్లు కేటాయించారు. మిషన్ శక్తి (మహిళల ప్రొటెక్షన్, సాధికారత) కోసం రూ.3145 కోట్లు అలాట్ చేశారు. మహిళలకు అన్ని హక్కులు పొందేలా చేయడం, వారికి రక్షణ కల్పించడం, ప్రభుత్వ పథకాల్లో వారిని భాగస్వాములను చేయడం మిషన్ శక్తి (సంబల్) లక్ష్యం. మిషన్ వత్సల్య స్కీమ్ (చైల్డ్ ప్రొటెక్షన్ సర్వీసెస్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ సర్వీసెస్) కోసం రూ.1,472 కోట్లు కేటాయించారు. చిన్నారులకు సేఫ్, సెక్యూర్ వాతావరణం కల్పించడమే మిషన్ వత్సల్య స్కీమ్ లక్ష్యం.

హోంశాఖకు రూ.2 లక్షల కోట్లు

పారామిలటరీ బలగాలకు అత్యధికంగా రూ.1.32 లక్షల కోట్లు



న్యూఢిల్లీ: దేశ అంతర్గత భద్రతను పర్యవేక్షించే కేంద్ర హోంశాఖకు 2024-25 మధ్యంతర బడ్జెట్ లో రూ.2,02,868.70 కోట్లు కేటాయించారు. ఇందులో కేంద్ర ప్రభుత్వ పరిధిలోని పారామిలటరీ బలగాలకే ఇందులో అత్యధిక నిధులు దక్కనున్నాయి. హోంశాఖకు కేటాయించిన మొత్తం నిధుల్లో రూ.1,32,345.47 కోట్లు పారామిలటరీ బలగాలకే వెళ్లనున్నాయి. ప్రధాన మంత్రి ఆఫీసు(పీఎంవో), కేబినెట్, కేబినెట్ సెక్రటేరియట్, ఆతిథ్యం, ఎంటర్‌టైన్‌మెంట్ ఖర్చుల కోసం కేబినెట్‌కు రూ.1248.91కోట్లు ఖర్చు చేయనున్నారు. అలాగే ఆర్టికల్ 370 రద్దు చేసి కేంద్ర పాలిత ప్రాంతంగా ఏర్పాటు చేసిన జమ్మూ కాశ్మీర్‌కు రూ.37,277.74కోట్లు ఇస్తారు. లద్దాఖ్ కోసం రూ.5,958 కోట్లు, అండమాన్ నికోబార్ దీవులకు రూ.5,866.37 కోట్లు, చండీగఢ్ రూ.5,862.62 కోట్లు, పుదుచ్చేరికి రూ.3,269.00 కోట్లు, దాద్రా, నగర్ హవేలీ, డామన్, దయ్యూకు రూ.2,648.97 కోట్లు, ఢిల్లీకి రూ.1,490.10 కోట్లు, లక్షద్వీప్‌కు రూ.10 కోట్లు అలాట్ చేశారు.

దేశ అంతర్గత భద్రతను పర్యవేక్షించే సెంట్రల్ రిజర్వు పోలీస్ ఫోర్స్ (సీఆర్‌పీఎఫ్)కు రూ.32,809.65 కోట్లు, బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్(బీఎస్ఎఫ్)కు రూ.25,027.52 కోట్లు, ఇండో టిబెటన్‌బోర్డర్ పోలీస్ (ఐటీబీపీ) కు రూ.8,253.53 కోట్లు, సశస్త్ర సీమా బల్ (ఎస్ఎస్‌బీ)కు రూ. 8,485.77 కోట్లు, అస్సాం రైఫిల్స్‌కు రూ. 7,368.33 కోట్లు ఖర్చు చేయనున్నారు. ఇంటెలిజెన్స్ బ్యూరో (ఐబీ)కి రూ.3,195.09 కోట్లు, దేశ రాజధాని ఢిల్లీ భద్రతను పర్యవేక్షించే ఢిల్లీ పోలీసులకు రూ.11,177.50 కోట్లు, స్పెషల్ ప్రొటెక్షన్ గ్రూప్(ఎస్పీజీ)కు రూ.506.32 కోట్లు కేటాయించారు. వామపక్ష తీవ్రవాద ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పన కోసం ప్రత్యేక ఫండ్ కింద రూ.3,199.62 కోట్లు, సరిహద్దు ప్రాంతా డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్(బీఏడీపీ)కి రూ.335.00 కోట్లు, సేఫ్ సిటీ ప్రాజెక్టులకు రూ.214.44 కోట్లు, ల్యాండ్ పోర్ట్ ఆథారిటీకి రూ.330.00 కోట్లు వెచ్చించనున్నారు.

ఢిల్లీ పోలీసులకు తగ్గిన నిధులు

ఈ మధ్యంతర బడ్జెట్ లో ఢిల్లీ పోలీసులకు కేంద్ర ఆర్థికశాఖ నిధులు తగ్గించింది. 2024-25కు రూ.11,177 కేటాయించింది. అయితే ఇది గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే 4.4 శాతం తక్కువ. 2023-24 ఆర్థిక సంవత్సరంలో ఢిల్లీ పోలీసులకు రూ.11,932 కోట్లు కేటాయించగా సవరించిన అంచనాలతో అది రూ.11,940 కోట్లకు చేరింది. దేశ రాజధానిలో శాంతిభద్రతల బాధ్యత ఢిల్లీ పోలీసులదే.. అలాగే సిటీలో ట్రాఫిక్ నిర్వహణ కూడా వారి పర్యవేక్షణలోనే ఉంటుంది.

సీబీఐకి రూ.928 కోట్లు
కేంద్రం ఆర్థిక మంత్రి నిర్మల ఈ బడ్జెట్ లో సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్(సీబీఐ)కి రూ.928.46 కోట్లు కేటాయించారు. ఇది గత ఆర్థిక సంవత్సరం కంటే రూ.40.4 కోట్లు తక్కువ. 2023-24 బడ్జెట్ లో సీబీఐకి రూ. 946.51 కోట్లు కేటాయించగా ఆ తర్వాత సవరించిన అంచనాలతో అది రూ.968.86 కోట్లకు పెరిగింది. అయితే ఏజెన్సీకి రూ.928.46 కోట్లు మాత్రమే ఇచ్చారు. పబ్లిక్ సర్వెంట్లు, ప్రైవేట్ వ్యక్తులు, సంస్థలు అక్రమాలు, అవినీతి.. ఇతర తీవ్రమైన నేరాలకు సంబంధించిన కేసులను సీబీఐ దర్యాప్తు చేసే సీబీఐ ఈ నిధులను ట్రైనింగ్‌సెంటర్ల డెవలప్‌మెంట్, మోడ్రనైజేషన్.. టెక్నికల్, ఫోరెన్సిక్ సపోర్ట్ యూనిట్ల ఏర్పాటు, ఆఫీసులు, సంస్థ ఇతర బిల్డింగ్‌ల నిర్మాణం, నిర్వహణ ఖర్చులకు వినియోగిస్తారు.




'మిషన్ కర్మయోగి'కి రూ.86 కోట్లు

న్యూఢిల్లీ: పర్సనల్ మినిస్ట్రీకి బడ్జెట్ లో రూ.312 కోట్లు కేటాయించారు. ఇందులో ట్రైనింగ్ డివిజన్ కు రూ.105.31 కోట్లు, ట్రైనింగ్ స్కీమ్స్ కోసం రూ.120.56 కోట్లు కేటాయింపులు చేశారు. ఇక సివిల్ సర్వీసెస్ ఉద్యోగులకు శిక్షణ ఇచ్చేందుకు చేపట్టిన 'మిషన్ కర్మయోగి'కి రూ.86.13 కోట్లు కేటాయించారు. ట్రైనింగ్ డివిజన్ కింద ఇనిస్టిట్యూట్ ఆఫ్‌సెక్రటేరియెట్ ట్రైనింగ్ అండ్ మేనేజ్ మెంట్ (ఐఎస్‌టీఎం), లాల్ బహదూర్ శాస్త్రి నేషనల్ అకాడమీ ఆఫ్ అడ్మినిస్ట్రేషన్ (ఎల్బీఎస్ ఎన్ఏఏ) ఉంటాయి. కాగా, సెంట్రల్ అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్ (క్యాట్) కు రూ.157.72 కోట్లు, స్టాఫ్ సెలక్షన్ కమిషన్ (ఎస్ఎస్ సీ)కు రూ.414.15 కోట్లు కేటాయించారు.

గ్రామీణాభివృద్ధికి నిధులు 12% పెంపు

- రూ. 1.77 లక్షల కోట్లు ప్రకటించిన ఆర్థిక మంత్రి



న్యూఢిల్లీ: కేంద్ర బడ్జెట్ లో గ్రామీణాభివృద్ధి శాఖకు కేటాయింపులు 12% పెరిగాయి. పోయిన ఆర్థిక సంవత్సరంలో రూ. 1.57 లక్షల కోట్లు కేటాయించగా.. ఈసారి (2024-25) రూ. 1.77 లక్షల కోట్లకు అలకేషన్ ను ఆర్థిక మంత్రి నిర్మల పెంచారు. అయితే, గత బడ్జెట్ లో రివైజ్డ్ ఎస్టిమేట్స్ ప్రకారం చేసిన ఖర్చులు రూ. 1.71 లక్షల కోట్లకు చేరాయి. దీని ప్రకారం చూస్తే తాజాగా కేటాయింపులు 3 శాతం మాత్రమే పెరిగాయి. తాజా కేటాయింపుల్లో ఉపాధి హామీ పథకానికి రూ. 86 వేల కోట్లను కేటాయించారు. గత బడ్జెట్ లో రూ. 60 వేల కోట్లు కేటాయించగా, ఈ సారి 43 శాతం నిధులు పెరిగాయి. అయితే, రివైజ్డ్ ఎస్టిమేట్స్ ప్రకారం చూస్తే చేసిన వ్యయం రూ. 86 వేల కోట్లకు చేరింది. తాజాగా అంతే మొత్తంలో నిధులను కేటాయించారు. అంతకుముందు 2022-23లో రూ. 73 వేల కోట్లను కేటాయించగా.. రూ. 90,805 కోట్లను ఖర్చు చేశారు. ఇక ప్రధాన మంత్రి ఆవాస్ యోజన గ్రామీణ్ కింద మరో 2 కోట్ల ఇండ్లను నిర్మిస్తామని ఆర్థిక మంత్రి ప్రకటించారు. ఈ స్కీం కోసం రూ. 54,500 కోట్లు కేటాయించారు. గత బడ్జెట్ లో ఈ పథకానికి రూ. 54,487 కోట్లు కేటాయించగా, రూ. 32 వేల కోట్లు మాత్రమే ఖర్చు చేశారు.

డిఫెన్స్‌కు మస్తు నిధులు

బడ్జెట్‌లో టాప్ ప్రయారిటీ.. రూ.6.21 లక్షల కోట్లు అలాట్





న్యూఢిల్లీ: రక్షణ రంగానికి 2024-25 మధ్యంతర బడ్జెట్‌లో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ భారీగా కేటాయింపులు చేశారు. బార్డర్‌లో మిలిటరీ మోడ్రనైజేషన్, మౌలిక సదుపాయాల కల్పన కోసం అధిక ప్రాధాన్యం ఇచ్చారు. అలాగే మిలటరీకి మరింత బలం చేకూర్చేలా ''డీప్ టెక్'' టెక్నాలజీల కోసం ప్రత్యేక స్కీమ్‌ను ప్రకటించారు. దేశీయంగా 'అత్మనిర్భర్ భారత్' ద్వారా ఈ టెక్నాలజీని పెంచడం ఈ స్కీమ్ ఉద్దేశం. 2024-25 బడ్జెట్‌లో డిఫెన్స్‌కు రూ.6.21 లక్షల కోట్లు అలాట్ చేశారు. ఏటా దేశరక్షణకు నిధులు పెంచుతున్నట్లుగానే ఈ సారి కూడా దాదాపు రూ.27 వేల కోట్లు పెంచారు. 2023-24 బడ్జెట్‌లో డిఫెన్స్‌కు రూ.5.94 లక్షల కోట్లు కేటాయించిన సంగతి తెలిసిందే. ఢిఫెన్స్ నిధుల్లో ఆయుధ కొనుగోళ్లు, సబ్ మెరైన్లు, డ్రోన్లు, యుద్ధ విమానాల సంఖ్యను పెంచుకునేందుకు కేటాయింపులు పెంచారు. ఇందుకోసం మూలధన వ్యయానికి (క్యాపిటల్ ఎక్స్‌పెండెచర్) మొత్తం రూ.1.72 లక్షల కోట్లు అలాట్. దీనికి గత బడ్జెట్ రూ.1.62 లక్షల కోట్లు ఇవ్వగా ఈ సారి రూ.10 వేల కోట్లు పెంచారు.

డిఫెన్స్ కు ఇచ్చిన నిధుల్లో రెవెన్యూ ఖర్చులకు రూ.4,39,300 కోట్లు కేటాయించారు. ఇందులో మాజీ సైనికుల పెన్షన్ కోసం రూ.1,41,205 కోట్లు, డిఫెన్స్ సర్వీసెస్‌కు రూ.2,82,772 కోట్లు, రక్షణ మంత్రిత్వ శాఖ (సివిల్) కోసం రూ. 15,322కోట్లు ఖర్చు చేయనున్నారు. అలాగే 2024-25 బడ్జెట్‌లో సైనికుల రెవెన్యూ ఎక్స్‌పెండెచర్ కోసం రూ. 1,92,680 కోట్లు అలాట్ చేశారు. నేవీ, ఇండియన్ ఎయిర్ ఫోర్స్ రెవెన్యూ ఖర్చుల కోసం వరుసగా రూ. 32,778 కోట్లు, రూ.46,223 కోట్లు కేటాయించారు. క్యాపిటల్ వ్యయంలో విమానాలు, ఏరో ఇంజిన్లకు రూ.40,777 కోట్లు, ఇతర పరికరాల కోసం రూ.62,343 కోట్లు వెచ్చించనున్నారు. నౌకాదళానికి రూ.23,800 కోట్లు, నావల్ డాక్‌యార్డ్ ప్రాజెక్టులకు రూ.6,830 కోట్లు కేటాయించారు. రక్షణ రంగానికి కేటాయింపులు కేంద్ర ప్రభుత్వం దేశభద్రతకు ఇస్తున్న ప్రాధాన్యాన్ని స్పష్టం చేస్తున్నదని జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీలోని నేషనల్ సెక్యూరిటీ స్టడీస్ స్పెషల్ సెంటర్‌కు చెందిన ప్రొఫెసర్ డాక్టర్ లక్ష్మణ్ కుమార్ బెహెరా తెలిపారు. ''డిఫెన్స్‌కు బడ్జెట్ కేటాయింపులు బాగున్నాయి. మూలధన వ్యయం కింద రూ.10,000 కోట్లు పెరగడం మంచి ఇండికేషన్'' అని బెహెరా అన్నారు.